క్లుప్తంగా

కంటి ఆపరేషన్లకు 85 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం రాముల గుడివీధిలోని జైన్ కార్యాలయంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తిరుపతి ఎస్వీ అరవింద్ ఆస్పత్రి వైద్యులచే కంటి పరీక్షలు చేశారు. ఈశిబిరానికి 170 మంది వచ్చారు. వారికి పరీక్షలు చేయగా ఆపరేషన్‌కు 85 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్, వసతులు కల్పిస్తామని నిర్వాహకులు సుభాష్ జైన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రేమ్‌చంద్, సాగర్, ప్రవీణ్, లలిత్, కమలేష్, అమిత్ పాల్గొన్నారు.

మునీశ్వర స్వామికి పూజలు


పూజాసామగ్రిని ఊరేగింపు తీసుకెళ్తున్న భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రమైన తవణంపల్లెలో ఆదివారం మునీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు స్వామికి పూజాసామగ్రి, పొంగళ్లను ఊరేగింపుగా తీసుకొచ్చారు. స్వామికి పూజలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. భక్తులు స్వామికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆడిమాసంలో ఏటా స్వామికి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు.

ఆకర్షణకు లోన్ కావొద్దు

పెరుగుతున్న టెక్నాలజీ వల్ల జరుగుతున్న మేలు ఎంత ఉందో.. అంతే స్థాయిలో కొందరు కేటుగాళ్లు టెక్నాలజీని ఉపయోగించుకుంటూ అమాయకులకు గాలం వేస్తున్నారు. ష్యూరిటీ లేకుండానే రుణం అని చెప్పి.. ఆకర్షిస్తారు. అలా ప్రైవేట్ యాప్‌ల ద్వారా రుణం తీసుకున్న తరువాత అసలు కథ మొదలవుతుంది. తీసుకున్న నగదు కంటే వడ్డీకి వడ్డీ వేసి అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి చేస్తారు. లేదంటే నగ్న వీడియోలు పెడతామని బ్లాక్‌మెయిల్‌కు దిగుతారు. వారి టార్చర్ తట్టుకోలేక కొందరు లోలోపలే కుంగిపోతుంటే మరికొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రైవేట్ యాప్‌లలో రుణాలు తీసుకుని మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

- యువతకు రుణం పేరిట గాలం వేస్తున్న ప్రైవేట్ యాప్‌ల నిర్వాహకులు
- ష్యూరిటీ లేకుండానే అకౌంట్‌లో నగదు క్రెడిట్
- ఆపై తీసుకున్న నగదు కంటే అధిక మొత్తం కట్టాలంటూ ఒత్తిడి
- సకాలంలో చెల్లించకపోతే బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్న నిర్వాహకులు
- క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువత
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు





బంగారుపాళెం: సాంకేతికత కొన్ని సందర్భాల్లో గాడి తప్పుతోంది. అరచేతిలో ప్రపంచాన్ని చూస్తున్న మనం.. అదే సాంకేతికత వల్ల నిట్టనిలువునా మోసపోతున్న సందర్భాలను చూస్తున్నాము. ప్రజల అవసరాలను, వారి బలహీనతలను ఆసరాగా తీసుకుని రుణ యాప్ నిర్వాహకులు పేట్రేగిపోతున్నారు. మండలంలో అనేక మంది బాధితులు బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. లోన్ యాప్స్ నిర్వాహకుల వలలో పడి అవస్థలు పడుతున్నారు. మీరు రుణం తీసుకోవడానికి ఎంపికయ్యారంటూ ఫోన్లు చేసి యువతకు వల వేస్తున్నారు. చూద్దామని చెబితే చాలు.. రుణం తీసుకునే వరకూ ఫోన్ చేసి, ఏదో విధంగా ఒప్పించి రుణం తీసుకునేలా చేస్తారు. తీరా లోన్ యాప్ ద్వారా రుణం తీసుకుంటే, వడ్డీకి వడ్డీ వేసి, రుణం సొమ్ము నుంచే ముందుగానే కొంత మినహాయించి ఇస్తారు. ఇలా పూతలపట్టు నియోజకవర్గ పరిధిలో చాలామంది బాధితులు లోన్ యాప్ నిర్వాహకుల చేతిలో మోసపోయి ఎవరికీ చెప్పుకోలేక ఆందోళన చెందుతున్నారు.

ఒక్క క్లిక్‌తో..

మీ మొబైల్ ఫోన్‌లో ఒకే ఒక క్లిక్‌తో యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి. హామీ లేకుండా రుణం పొందండంటూ రుణ యాప్ నిర్వాహకులు ఇచ్చే ప్రకటనలకు కొందరు ఆకర్షితులవుతున్నారు. ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. ఒక్కసారి యాప్‌ల వలలో చిక్కితే బయటపడడం అసాధ్యం.

వేధింపులు ఇలా..

రుణం తీసుకున్న రోజు నుంచే చెలింపుల కోసం నిర్వాహకులు తీవ్రంగా ఒత్తిడి చేస్తారు. చెల్లింపులు ఆలస్యమయ్యే కొద్దీ వేధింపులు మరింత తీవ్రతరమవుతాయి. రుణ గ్రహీత మొబైల్‌కు పరువు, ప్రతిష్టకు భంగం కలిగించే పోస్టులతో దుష్ప్రచారాలతో కూడిన సందేశాలు, అభ్యంతరకర ఫొటోలు పంపుతారు. బెదిరింపులను లెక్క చేయకపోతే రుణం తీసుకున్న వారి కుటుంబసభ్యుల ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం పొందిన వారి సెల్‌ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లకు వాట్సాప్‌లకు పంపుతారు. వీరి ఆగడాలను కొందరు బయట చెప్పుకోలేక నలిగిపోతున్నారు. కొందరు యువకులు రుణం తీర్చడానికి కుటుంబ సభ్యులను మోసం చేయడం, చోరీలకు సైతం పాల్పడడం జరుగుతున్నాయి. ముఖ్యంగా యాప్‌ల నిర్వాహకులు గ్రామీణ ప్రాంతాలపైనే కన్నేశారు.

ఓటీపీ అడిగి..

బంగారుపాళెం పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి..మీ పాన్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేస్తామని చెప్తారు. ఓటీపీలు చెప్పమన్నారు. రెండుసార్లు ఓటీపీలు చెప్పడంతో ఆ వ్యాపారి బ్యాంక్ ఖాతా నుంచి రూ.1.30 లక్షలు మాయమయ్యాయి

- మండలంలోని సదకుప్పానికి చెందిన ఓ వ్యక్తికి జాబ్ ఇప్పిస్తామని చెప్పి ఫోన్ ద్వారా రూ.30 వేలు కాజేశారు.
- అదేవిధంగా ఓ ఉపాధ్యాయుడికి ఫోన్ చేసి ఏటీఎం కార్డు బ్లాక్ అయింది.. ఓటీపీ చెప్పండని అడిగారు. దీంతో ఓటీపీ చెప్పగానే ఉపాధ్యాయుడి ఖాతా నుంచి రూ.3 లక్షల మాయమయ్యాయి. దీంతో బాధితులు చిత్తూరు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఇలా చాలా మంది మోసాలకు గురై క్రైమ్ పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి..



స్మార్ట్‌ఫోన్‌లో మనకు తెలియని యాప్‌లు కనిపిస్తే వాటి జోలికి వెళ్లవద్దు. అదే విధంగా తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఓటీపీలు చెప్పండని అడిగినా.. అపరిచిత వ్యక్తుల ఫోన్‌లకు సమాధానం ఇవ్వకండి. ప్రతి యాప్‌ను క్లిక్ చేయకూడదు. క్లిక్ చేశారంటే ఇబ్బందులను కొని తెచ్చుకున్నట్లే. రుణయాప్‌లలో అప్పులు తీసుకుని మోసపోవద్దు. హామీ లేకుండా రుణాలు వస్తున్నాయని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆశ పడవద్దు. రుణాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి. రుణ యాప్ నిర్వాహకుల నుంచి వేధింపులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

- కత్తి శ్రీనివాసులు, సీఐ, బంగారుపాళెం

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి గ్రీవెన్స్ నిర్వహిస్తామని.. ప్రజల ఫిర్యాదులు, వినతులు ఇక్కడ స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. మండలస్థాయి అధికారులు తప్పని సరిగా హాజరుకావాలని సూచించారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పలమనేరు హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు

పలమనేరు : పట్టణ సమీపంలోని పత్తికొండ వద్ద రెండు రోజుల క్రితం వ్యక్తి మృతిచెందాడు. అతని కోసం ఎవరూ రాలేదు. పోలీసులు విచారణ చేపట్టినా అతని ఆచూకీ తెలియలేదు. ఈ క్రమంలో అతని మృతదేహానికి ఆదివారం హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకులు స్థానిక హిందూ శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జీలుబాయ్, నాగశివ, శక్తి, ప్రసాద్, యువరాజ్, నరేంద్ర పాల్గొన్నారు.

విజ్ఞాన శాస్త్రాన్ని అర్థమయ్యేలా బోధించాలి


టీచింగ్ లైట్ ద రైట్ వే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పలమనేరు: విజ్ఞాన శాస్త్రాన్ని పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాబు తెలిపారు. స్థానిక కళామందిరంలో ఆదివారం టీచింగ్ లైట్ ద రైట్ వే అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇందులో విజ్ఞాన శాస్త్రాన్ని ఎలా బోధించాలో పుస్తక రచయిత మణి విశదీకరించారని తెలిపారు. అనంతరం పుస్తక రచయితను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధనుంజయ, ఉమామహేశ్వర్‌రెడ్డి, తులసీనాథం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలేవి బాబూ ?

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం కోల్పోయింది
- వారి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో పూతలపట్టు సమన్వయకర్త సునీల్‌కుమార్


మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: అధికారం చేపట్టిన ఏడాది పాలనలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసం పూర్తిగా కోల్పోయిందని పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఆదివారం సాయంత్రం తవణంపల్లెలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు సి.పి.హరిరెడ్డి ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన మండల పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తే.. ప్రస్తుత సీఎం చంద్రబాబు, మంత్రులు లోకేష్, పవన్‌కల్యాణ్ సూపర్‌సిక్స్ ఎన్నికల సమయంలో ఇచ్చిన మేనిఫెస్టోలోని హామీలను ఒక్కటీ అమలు చేయక విఫలమయ్యారని దుయ్యబట్టారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు అందరికీ అందడం లేదని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి ఎక్కడ ? బాబు వస్తే జాబు అన్నారు ఆ జాబులేవీ అంటూ నిలదీశారు. కల్లబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన మిమ్మల్ని ప్రజలు వదలరన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సీఎం చంద్రబాబు వేలాది కోట్ల రూపాయలు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని విస్మరించి వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు, కేసులు పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారం చేపడుతుందని.. కూటమి నాయకులకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పార్టీ కోసం పని చేసే వారికే గుర్తింపు

ప్రతిపక్షంలో ఉన్నాం.. కూటమి నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని దాడులు చేసినా, తప్పుడు కేసులు పెట్టినా పార్టీ కోసం కష్టకాలంలో పని చేసే వారికి అధినేత జగనన్న ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఆదుకుంటారని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామాల్లో పార్టీకి మంచి పట్టు ఉంది..కానీ వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. తవణంపల్లె మండలం పూతలపట్టు నియోజకవర్గానికి గుండెలాంటిది నాయకులు పట్టు వదలకుండా పార్టీని బలోపేతం చేయాలని కోరారు. ఇకపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా వెన్నుదన్నుగా తానుంటానని భరోసా ఇచ్చారు. క్యూఆర్ కోడ్‌పై అవగాహన కల్పించారు. ప్రజలకు కూడా క్యూర్ కోడ్‌లో చంద్రబాబు ఇచ్చిన హామీను వివరించి అవగాహన కల్పించాలని నాయకులు హితోపదేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిషోర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రకాష్‌బాబు రెడ్డి, సిద్దారెడ్డి, వరప్రసాద్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, సుకేష్ రెడ్డి, పాలాక్షి రెడ్డి, దూర్వాసులు రెడ్డి, గిరిరెడ్డి, మురుగన్, పట్టాభిరెడ్డి, పరదేశి, పార్థసారథి రెడ్డి, చిట్టిబాబు, వేణుగోపాల్, జనార్దన్, హరీష్, యుగంధర్, దామోదరం, చింటి, యుగమూర్తి, రెడ్డెప్ప, అనుబంధ సంస్థ ప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

పెద్దిరెడ్డి కుటుంబంపై కక్ష సాధింపు తగదు


పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో జగదీశ్వర్‌రెడ్డి బృందం

పూతలపట్టు(యాదమరి): మాజీమంత్రి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర మేధావుల వేదిక కార్యదర్శి పి.జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూతలపట్టు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం తిరుపతిలోని పెద్దిరెడ్డి నివాసంలో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెద్దిరెడ్డి కుటుంబాన్ని మానసికంగా, రాజకీయంగా దెబ్బతీయడానికే అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. ఇంత కష్టంలో కూడా ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి అండగా నిలవాలని, పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సూచించడం ఆయన గొప్పతనమని చెప్పారు. త్వరలోనే అక్రమంగా అరెస్టు అయిన మిథున్‌రెడ్డి త్వరలోనే కడిగిన ముత్యంలా బయటకు వస్తాడని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు కాదర్‌వల్లి, మాజీ సర్పంచ్ రాజేంద్ర, నాయకులు నాగరాజ, మాసిలామణి, వరప్రసాద్‌నాయుడు, అమర్నాథ్, గౌస్‌బాష, మురళీకృష్ణ, గోపి తదితరులు పాల్గొనారు.

సచివాలయ ఉద్యోగిపై వేధింపులు తగదు

కార్వేటినగరం: మండలంలోని పొన్నగల్లు గ్రామానికి చెందిన వై.రాధాకృష్ణయ్య కుమారుడు వై.కేశవులు సీడీ కండ్రిగ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అయితే పొన్నగల్లుకు చెందిన కొందరు టీడీపీ నాయకులు కేశవులు వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరుడిగా ఉంటాడనే అనుమానంతో సర్వే నంబర్ 163లో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నాడని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ పరిశీలించాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఎలాంటి ఆక్రమణలు జరగలేదని నివేదిక పంపారు. దీనిపై రాధాకృష్ణయ్య మాట్లాడుతూ టీడీపీ నేతలు తమను వేధిస్తున్నారని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

చదరంగంలో రాణిస్తే అనేక ప్రయోజనాలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్ : విద్యార్థులు చదరంగం క్రీడపై మక్కువ పెంచుకుని రాణించాలని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌ఆర్‌బీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాలకు చెందిన 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధో సంపత్తిని పెంపొందించే మనోహరమైన క్రీడా అని అన్నారు. ఈ క్రీడను క్రమం తప్పకుండా ఆడడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. సామాజిక సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో చదరంగం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఈ పోటీల్లో మొదటి బహుమతి కైవసం చేసుకున్న ద్వారక అర్జున్, రెండవ బహుమతి పొందిన మౌనిష్, మూడవ బహుమతి పొందిన కుందనశ్రీ, నాలుగవ బహుమతి పొందిన లోహిత్ అక్షయ్ నాయక్‌కు బహుమతులు అందజేసి అభినందించారు. పోటీల్లో పలువురు చదరంగం అభిమానులు పాల్గొన్నారు.

మోసాలకు కేరాఫ్ చంద్రబాబు


జానకారపల్లెలో పోస్టర్లు విడుదల చేస్తున్న చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, నాయకులు


కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజలు

- ప్రజలకు సంక్షేమం అందించడం సీఎం చంద్రబాబుకు నచ్చదు
- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో చిత్తూరు సమన్వయకర్త విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: నమ్మకానికి.. ఇచ్చిన మాట మీద నిలబడడంలో బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అయితే.. మోసానికి, వంచనకు నిలువెత్తు నిదర్శనం సీఎం చంద్రబాబునాయుడు అని వైఎస్సార్‌సీపీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి విమర్శించారు. నగరంలో 23వ డివిజన్ జానకారపల్లెలో కార్పొరేటర్ లక్ష్మణస్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ సరళమేరి, నాయకులు రాజశేఖర్, 26వ డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో కార్పొరేటర్ చల్ల ముత్తు, 25వ డివిజన్ మరాఠావీధిలో కార్పొరేటర్ దేవని, నాయకులు దేవరాజులు ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. జగనన్న ప్రజా సంకల్ప పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడి నవరత్నాలు, ఇతర పథకాలతో మేనిఫెస్టోను తయారు చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేశారని గుర్తు చేశారు. చెప్పిన మాట మీద నిలబడడమే కాకుండా అదనంగా మరి కొన్ని సంక్షేమ కార్యక్రమాలు, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఇది నిజమా ? కాదా ? అని ప్రజలను ప్రశ్నించారు. మహిళలు, యువత మూకుమ్మడిగా అవునని, ఆ పథకాల వల్ల తాము లబ్ధి పొందామని చెప్పారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు అండ్–కో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీలను గుర్తు చేసి, వాటిని కూటమి ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రజలను ఆరా తీశారు. ఏ హామీలు అమలు కావడం లేదని ప్రజలు ముక్తకంఠంతో బదులిచ్చారు. వైఎస్సార్‌సీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తూనే అదనంగా మరికొన్ని పథకాలు అమలు చేస్తామని చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో చెప్పారని, కానీ ఏ ఒక్క పథకమూ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి, మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడారు. చంద్రబాబు హయాంలోనే మద్యం స్కాం జరిగిందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం చంద్రబాబుకు ఇష్టం ఉండదన్నారు. ఇచ్చిన హామీలను ఎప్పుడు తీరుస్తారో అనే విషయంపై స్పష్టత లేదన్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టడం ఆనవాయితీగా మారిందన్నారు. కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు కేపీ శ్రీధర్, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సూర్యప్రతాప్‌రెడ్డి, చిత్తూరు యువత నియోజకవర్గ అధ్యక్షుడు మనోజ్‌రెడ్డి, నాయకులు అన్బు, శేఖర్, మురళీరెడ్డి, శంకర్, నౌషద్, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.